ప్రజాశక్తి

బుధవారం 19 ఏప్రిల్ 2023 5 విజయనగరం



## ముఖ్యమంత్రిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని మంగళవారం తాడేపల్లి లోని సిఎం క్యాంప్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కలెక్టర్ గా ఇటీవలే బాధ్యతలు చేపట్టిన ఆమె త్వరలో జరగనున్న భోగాపురం అంతర్జాతీయ గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయం శంకుస్థాపనకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో చేయనున్న ఏర్పాట్ల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాల అమలుపై ముఖ్యమంత్రికి నివేదించారు.



సిఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కలెక్టర్ నాగలక్ష్మి




# భానుడు భగ..భగ

**అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదు • నిర్మానుష్యంగా మారిన రహదారులు**

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

భానుడి భగ భగలతో ప్రజలు ఠారెత్తిపోతున్నారు. ఎండ వేడికి అల్లాడిపోతున్నారు. వడ గాల్పులతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఉదయం 7 గంటల నుంచే సూర్యుడి ప్రతాపంతో నగరంలోను, మండల కేంద్రాల్లోనూ రహదారులన్నీ బోసి పోతున్నాయి. మంగళవారం విజయనగరం కేంద్రంలో అత్యధికంగా 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా బొబ్బిలిలో 43, శృంగవరపుకోట 43, పార్వతీపురం మన్యం జిల్లాలో 43, సాలూరులో 42 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. దీంతో ప్రధాన రహదారులన్నీ మధ్యాహ్నం నిర్మానుష్యంగా మారాయి. నిత్యం రద్దీగా ఉండే ఎంజి రోడ్డు, బాలాజీ జంక్షన్, కన్యకాపరమేశ్వరి జంక్షన్ ఎండ తీవ్రతతో బోసిపోయాయి. వివిధ పనులపై బయటకు వెళ్లిన వారు 12గంటల్లోపే చక్కబెట్టుకొని ఇళ్లకు చేరుకున్నారు. పలు మండలాల్లో వడ గాల్పులతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బస్సుల్లో ప్రయాణాలు చేసే వారు సైతం వడగాల్పులకు గురయ్యారు. ఏజెన్సీ ప్రాంతాల్లో సైతం అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. వివిధ వృత్తులపై పనిచేసే వారంతా ఎండలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు అవసరమైతేనే బయటకు రావాలని, తగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. ఎక్కువగా ద్రవ పదార్థాలు తీసుకోవాలని చెబుతున్నారు.





నిర్మానుష్యంగా ఉన్న ఎమ్‌జి రోడ్డు

# రౌడీషీటర్ దారుణహత్య

- పెట్రోల్‌పోసి తగులబెట్టి ..
- రెండు రోజుల ముందు బార్‌లో ఘర్షణ
- పోలీసుల అదుపులో నిందితులు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని కాట వీధికి చెందిన రౌడీ షీటర్ షేక్ అలీజాన్ (33) దారుణ హత్యకు గురయ్యాడు. గుర్తు తెలియని వ్యక్తులు అతడిని అపహరించి విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం, చిన్నాపురం సమీపంలో ఒక ప్రైవేట్ లే అవుట్లో పెట్రోల్ పోసి తగలబెట్టేసిన ఘటన మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. అలీజాన్‌పై రెండో పట్టణ స్టేషన్ పరిధిలో రౌడీ షీట్ ఉంది. ఒకటో పట్టణ, రెండో పట్టణ, విశాఖపట్నం సిటీలో పలు స్టేషన్లలో ఇతడి మీద నేరాభియోగాలు నమోదై ఉన్నాయి. పోలీసుల కథనం ప్రకారం..

ఈనెల 15 నగరంలోని దాసన్నపేట రింగురోడ్డు సమీపంలో గల బాబు రెస్టారెంట్ అండ్ బార్‌లో అలీజాన్, లక్ష్మణరావుతో పాటు మరికొంతమంది మద్యం తాగేందుకు వెళ్లారు. అరువు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇచ్చేది లేదని బార్ నిర్వాహకులు చెప్పడంతో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది. ఇందులో అలీజాన్‌తో పాటు వచ్చిన లక్ష్మణరావు అనే వ్యక్తి గాయపడగా, బార్‌లో పనిచేస్తున్న వెయిటర్ సూరిబాబు కూడా గాయపడ్డాడు. లక్ష్మణరావు తలకు బలమైన గాయం కావడంతో తిరుమల-మెడికవర్ ఆసుపత్రికి తరలించారు. సూరిబాబును ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో చేర్చారు. లక్ష్మణరావును గాయపర్చినందుకు డబ్బులు ఇవ్వాలని అలీజాన్ సెటిల్‌మెంట్‌కు దిగాడు. దీంతో ఇరువర్గాల మధ్య మళ్లీ ఘర్షణ చోటు చేసుకుంది. లక్ష్మణరావును చూసేందుకు అలీజాన్ ఆసుపత్రికి వచ్చినట్లు అదే రోజు రాత్రి సిసి కెమెరాల్లో నిక్షిప్తమైంది. కానీ, ఆ తరువాత బయటకు వచ్చినట్లుగాని, ఎటు పక్క వెళ్లినట్లుగాని కనిపించలేదు. తన భర్త అలీజాన్ కనిపించడం లేదని భార్య నాజియా రెండో పట్టణ స్టేషన్లో 16వ తేదీన ఫిర్యాదు చేసింది.



రౌడీషీటర్ అలీజాన్ (ఫైల్)

అలీజాన్‌ను ఏం చేశారో చెప్పాలని ఆయన అనుచరులు చక్రధర్ తో పాటు మరో ఆరుగురు వ్యక్తులు తోటపాలెంలో నివాసం ఉంటున్న బార్ సూపర్‌వైజర్ శివప్రసాద్ ఇంటికి 16వ తేదీ అర్ధరాత్రి వెళ్లి ఘర్షణకు దిగారు. మారణ ఆయుధాలతో దాడి చేస్తుండగా, శివప్రసాద్ భార్య అడ్డుకోగా, ఆమెను కారులో ఎక్కించుకొని వెళ్లిపోయారు. ఇంతలో సమాచారం తెలుసుకున్న శివప్రసాద్ తోడల్లుడు జి.సన్యాసినాయుడు వెంబడించడంతో ఎల్లమ్మతల్లి గుడి వద్ద వదిలేశారు. బాధితుడు శివప్రసాద్ సోమవారం ఒకటో పట్టణ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. బార్లో జరిగిన ఘర్షణను దష్టిలో పెట్టుకొని తన మీద దాడికి దిగారని, కానీ, అలీజాన్ గురించి తనకు తెలియదని ఆ ఫిర్యాదులో పేర్కొన్నాడు.

**పోలీసుల అదుపులో నిందితులు**

ఈ నేరానికి పాల్పడిన వారిలో నలుగురు వ్యక్తులు పోలీసుల ఎదుట లొంగిపోయినట్లు తెలిసింది. పదే పదే బార్‌కు వచ్చి ఘర్షణ పడటం, పైగా చంపేస్తానని బెదిరించడంతో ఆత్మరక్షణ కోసం చంపేశారని నిందితులు పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. ఇదిలా ఉండగా, అలీజాన్ గతంలో పోలీసులను సైతం బెదిరించిన ఘటనలు ఉన్నాయని తెలిసింది. నగరంలో పలు బార్లలో మద్యం తాగాక డబ్బులు ఇవ్వకపోవడం, భూ కబ్జాల్లో సెటిల్మెంట్లుకు దిగడం, పలు రాజకీయ పార్టీలకు సంబంధించిన కేసులు సెటిల్మెంట్లలో అలీజాన్‌పై అరోపణలు ఉన్నట్లు తెలిసింది.

**అలీజాన్ అదృశ్యంపై కేసు నమోదు చేశాం**

అలీజాన్ అదృశ్యమైనట్లు వచ్చిన ఫిర్యాదుపై వెంటనే కేసు నమోదు చేశామని వన్‌టౌన్ సిఐ బి.వెంకటరావు, సిహెచ్ లక్ష్మణరావు తెలిపారు. అలీజాన్ అనుచరులు కొంతమంది వెళ్లి తోటపాలెంలో బార్ సూపర్‌వైజర్ శివప్రసాద్‌ను బెదిరించడంతో హత్యాయత్నం, కిడ్నాప్‌కు పాల్పడిన కేసులు నమోదయ్యాయని తెలిపారు. మృతుడిపై రౌడీషీట్ ఉందని, త్వరలోనే కేసును ఛేదించి కారణాలు వెల్లడిస్తామని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సర్వజన ఆసుపత్రికి తరలించామని తెలిపారు.



కలెక్టరేట్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు

## కాంగ్రెస్ నాయకుల సత్యాగ్రహ దీక్ష

ప్రజాశక్తి-విజయనగరం కోట

అదానీ అక్రమాలపై జాయింట్ పార్లమెంటరీ కమిటీ వేయాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యాన మంగళవారం కలెక్టరేట్ వద్ద సత్యాగ్రహ దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ పై మోడీ ప్రభుత్వం తప్పుడు పరువు నష్టం కేసు బనాయించి రెండేళ్ల శిక్ష వేయించినందుకు దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాల్లో భాగంగా ఈ దీక్ష చేపట్టామన్నారు. రాహుల్ గాంధీపై పార్లమెంట్ సభ్యత్వంపై అనర్హత వేటును వ్యతిరేకిస్తున్నామన్నారు. రాహుల్ గాంధీకి దేశవ్యాప్తంగా వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక బిజెపి ప్రభుత్వం కక్షపూరిత సాధింపు చర్యలకు దిగిందని దుయ్యబట్టారు. బిజెపి అధికారంలోకి రాకముందు అదానీ భారత ధనవంతుల్లో 608వ వాడిగా ఉండేవాడని, మోడీ అధికారంలోకి వచ్చిన తరువాత దేశంలోనే అదానీ రెండోస్థానంలో నిలిచాడని అన్నారు. రాహుల్ గాంధీ భారత్ జూడో యాత్రలో భాగంగా దేశవ్యాప్తంగా పర్యటించి దేశ వాస్తవ పరిస్థితులను గ్రహించి పార్లమెంట్లో కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను నిలదీసినందుకు తప్పుడు కేసులు బనాయించారని అన్నారు. అనంతరం కలెక్టరేట్ గేట్ ఎదుట బైఠాయించి మోడీ డౌన్, డౌన్ ,అక్రమ కేసులను వెంటనే ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుంకర సతీష్ కుమార్, జిల్లా కార్యదర్శి డోల శ్రీనివాస్, టి. సూర్యనారాయణ, కూర్మారావు, వెంకటరమణ, శ్రీనివాసరావు, బంగారు నాయుడు, అచ్చి బాబు, పూడి శ్రీనివాసరావు, తెలుగు సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

# శివారు భూములకు సాగునీరందాలి

**సాగునీటి కాలువ పనులను త్వరగా పూర్తి చేయాలి : జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు**

ప్రజాశక్తి-విజయనగరం

శివారు భూములకు కూడా సాగునీరు అందేలా సాగునీటి కాలువ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను జిల్లా పరిషత్ ఛైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఆదేశించారు. గ్రామీణ ఉపాధిహామీ కింద చేపట్టిన సాగునీటి కాలువల అభివృద్ధి పనులపై, ఛైర్‌పర్సన్ తన ఛాంబర్‌లో మంగళవారం సమీక్షించారు. ప్రతీ ఎకరాకూ సాగునీరు అందించేందుకు కృషి చేయాలని జెడ్‌పి ఛైర్మన్ కోరారు. తోటపల్లి, గడిగెడ్డ, ఆంధ్ర, తాటిపూడి, తారకరామ తీర్థసాగర్ కాలువ పనుల ప్రగతిని తెలుసుకున్నారు. సాగునీటి కాలువలు ఉన్నచోట, ఈ కాలువ పనులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని, కాలువలు లేనిచోట మేజర్, మైనర్ చెరువు పనులను, ఫీడర్ కెనాల్ పనులను చేపట్టాలని సూచించారు. కాలువలు, చెరువుల్లో జంగిల్ క్లియరెన్స్, పూడిక తీత పనులను చేపట్టాలన్నారు. పనులు నిర్వహించేందుకు ఇదే తగిన సమయమని, ఈ మూడు నెలల్లోనే అత్యంత వేగంగా పనులు నిర్వహించి పూర్తి చేయాలని సూచించారు. ఇరిగేషన్, ఉపాధిహామీ అధికారులు కలిసి సమన్వయంతో పనిచేసి, వర్షాలు ప్రారంభమయ్యేలోగా పనులను పూర్తి చేయాలని చెప్పారు. లష్కర్ల గౌరవ వేతనాలను చెల్లించేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సూచించారు. సమావేశంలో జెడ్‌పి డిప్యూటీ సిఇఒ కె.రాజ్‌కుమార్, డిపిఒ శ్రీధర్‌రాజా, ఇరిగేషన్ ఇఇ రామచంద్రరావు, డిఎలధొ లక్ష్మణరావు, ఉపాధిహామీ ఎపిడిలు, ఇంజినీరింగ్ అధికారులు పాల్గొన్నారు.



ఇరిగేషన్ అధికారులతో మాట్లాడుతున్న జెడ్ ఛైర్మన్ శ్రీనివాసరావు

## నేటి నుంచి 'పది' మూల్యాంకనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పదో తరగతి పరీక్షల మూల్యాంకనం బుధవారం నుంచి విజయనగరంలోని కోటలో జరుగనుంది. మూల్యాంకన శిబిరాన్ని డిఇఒ ఇప్పటికే సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు . ఈ ఏడాది అన్ని సబ్జెక్టుల్లో 1,88,851 జవాబు పత్రాలను మూల్యాంకనం చేస్తారు. ఇందుకోసం 195 మంది చీఫ్ ఎగ్జామినర్లు, 585 మంది అసిస్టెంట్ ఎగ్జామినర్లు, 195 స్కిల్ అసిస్టెంట్లను నియమించారు. వీరికి ఇప్పటికే విధివిధానాలతో కూడిన ఆర్డర్ కాపీలను అందజేశారు.

**ఉపాధ్యాయులు దుమ్మా కొడితే చర్యలు**

సరైన కారణాలు లేకుండా మూల్యాంకన విధులకు గైర్హాజరైతే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని డిఇఒ లింగేశ్వర రెడ్డి తెలిపారు. మూల్యాంకనానికి కేటాయించిన ఉపాధ్యాయులు విధులకు తప్పనిసరిగా హాజరు కావాలని తెలిపారు.

## ఇ-ఆఫీసు విధానం తప్పనిసరి

**విజయనగరం :** జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఇ-ఆఫీసు విధానం తప్పనిసరిగా అమలు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జిల్లా అధికారులు, ఉద్యోగులకు జరిగిన ఇ-ఆఫీసు ఒకరోజు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో అన్ని ఉత్తర ప్రత్యుత్తరాలు ఇ-ఆఫీసు విధానం ద్వారానే జరగాలని తెలిపారు. రిజిస్ట్రేషను చేసుకోని కార్యాలయపు అధికారులు ఇ-ఆఫీసు అమలుకు తక్షణమే రిజిస్ట్రేషను చేసుకోవాలని ఆదేశించారు. ఇ-ఆఫీసు విధానం అమలులో ఏమైనా సందేహాలు ఉంటే ఎన్ఐసి అధికారులను సంప్రదించాలన్నారు. పవర్ పాయింట్ ప్రజేంటేషను ద్వారా ఇ-ఆఫీసు నిర్వహణ, ఫైలు ఆపలోడింగు, ఇ-ఆఫిసు విధానంలో ఫైల్స్ పంపే విధానం, జిల్లా అధికారులు ఇ-ఆఫీసు రిజిస్ట్రేషన్ చేసుకొనే విదానం తదితర విషయాలను కులంకుషంగా జిల్లా ఎన్ఐసి అధికారి ఎన్.నరేంద్ర, సిబ్బంది వివరించారు.

## పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి : వెంకయ్యనాయుడు

ప్రజాశక్తి-రాజాం

విద్యార్థులు నైపుణ్యం సాధించి పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని, తద్వారా ఇతరులకు ఉపాధి కల్పించాలని భారత మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. రాజాంలోని జిఎంఆర్‌విఎఫ్ క్యాంపస్‌లో నాబార్డు మద్దతుతో కూడిన నైపుణ్య అభివృద్ధి కార్యక్రమాన్ని సందర్శించారు. రిఫ్రిజిరేషన్, ఎయిర్ కండిషనింగ్ కోర్సులో శిక్షణ పొందిన వారితో సంభాషించారు. విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ, జీవనోపాధి, ఉపాధిని కనుగొనడంలో దోహదపడుతుందని ఆయన సూచించారు. నాబార్డు డిడిఎం టి.నాగార్జున వ్యవసాయం, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు మరియు స్వయం సహాయక సంఘాలలో నాబార్డు అభివృద్ధి పనుల గురించి వివరించారు. జిఎంఆర్ ఐటికి చేరుకున్న వెంకయ్య నాయుడును రెడ్ క్రాస్ సంస్థ రాజాం ప్రతినిధులు కలిసి తమ సంస్థ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. కె.సాయి ప్రశాంత్ కుమార్, పెంకి చైతన్య కుమార్, జి వి అచ్యుత్ కుమార్, కె జ్యోతి తదితరులు రెడ్ క్రాస్ అందిస్తున్న సేవలను మాజీ ఉప రాష్ట్రపతి కి వివరించారు. దీనిపై అభినందిస్తూ సంస్థ సేవలను మరింతగా విస్తరించాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని, బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని సూచించారు. తెలుగు భాష ఔన్నత్యం కాపాడేందుకు కాపాడాలని కోరారు.

# వైద్య సేవల్లో నిర్లక్ష్యం వద్దు

- మెడికల్ కళాశాలతో పేదలకు మెరుగైన వైద్యం
- సర్వజన ఆసుపత్రిలో కోలగట్ల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి-విజయనగరం

పేదలకు వైద్య సేవలు అందించడంలో వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ప్రదర్శించవద్దని శాసనసభ ఉప సభాపతి కోలగట్ల వీరభద్ర స్వామి అన్నారు. మంగళవారం జిల్లా సర్వజన ఆస్పత్రిని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఐసియూ, క్యాజువాలిటీ, ఇతర వార్డులను పరిశీలించి రోగులతో మాట్లాడారు. వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆ సమయంలో వార్డుల్లో ఏసీలు సక్రమంగా పనిచేయకపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రోగులు ఉక్కపోతతో ఎలా ఉండగలరని, తక్షణమే వాటిని అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ఎంతో సదుద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వ ఆసుపత్రులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలూ కల్పిస్తున్నారని గుర్తు చేశారు. రోగులకు చిన్నపాటి అసౌకర్యం కలిగినా ఉపేక్షించబోమని హెచ్చరించారు. ప్రధానంగా పారిశుధ్య లోపం లేకుండా చూడాలన్నారు. అనంతరం ఆసుపత్రి సిబ్బందితో సమావేశమయ్యారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పడకలు, వైద్య కళాశాలలో తరగతుల ప్రారంభం, వైద్యుల వివరాలు, రోగులకు అందిస్తున్న సౌకర్యాలపై ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పద్మ లీల వివరించారు. మౌలిక సదుపాయాలకు సంబంధించి ఏమైనా అవసరాలు ఉంటే తనను సంప్రదించాలని, వెంటనే పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటానని ఈ సందర్భంగా కోలగట్ల హామీ ఇచ్చారు.

**వైద్య కళాశాలతో అందుబాటులో అధునాతన వైద్య సేవలు**

గతంలో ఏదైనా అత్యవసర సందర్భంలో మెరుగైన వైద్యం కోసం జిల్లా ప్రజలకు విశాఖ కెజిహెచ్ దిక్కుగా ఉండేదని, వైద్య కళాశాల రాకతో ఇప్పుడు ఇక్కడే అధునాతన సేవలు రోగులకు అందుతాయని కోలగట్ల తెలిపారు. ఆసుపత్రి వద్ద మీడియాతో ఆయన మాట్లాడారు. ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, సీనియర్ డాక్టర్లు 24 గంటలూ అందుబాటులో ఉంటారని, ఆధునిక వైద్య పరికరాలన్నీ సమకూరుతాయని చెప్పారు. ఆసుపత్రిలో పడకల సంఖ్య పెరిగిందన్నారు. సామాన్య ప్రజానీకానికి వైద్య పరంగా ఇది ఒక భరోసా అన్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా కరోనా కేసులు అధికమవుతున్నాయని, ఎటువంటి పరిస్థితి వచ్చినా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని వైద్యాధికారులకు సూచించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ అప్పలనాయుడు, హెచ్ డి సి సభ్యులు డాక్టర్ వి.ఎస్.ప్రసాద్, రామేశ్వరరావు రామారావు, వైద్యాధికారులు సత్య ప్రభాకర్, ఘోషాస్పత్రి గైనకాలజిస్ట్ అరుణ శుభశ్రీ, కార్పొరేటర్లు పిన్నింటి కళావతి, సత్యవతి, వైద్యులు పాల్గొన్నారు.



రోగులతో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

## విద్య కాషాయికరణపై విద్యార్థుల నిరసన

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం విద్యలో కాషాయీకరణ తీసుకురావడం లక్ష్యంగా విద్యార్థులు చదువుకునే ఎన్‌సిఇఆర్‌టి సిలబస్‌లో శాస్త్రీయమైన పాఠ్యాంశాలను తొలగించడానికి ఖండిస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద విద్యార్థులు మంగళవారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష ,కార్యదర్శులు సిహెచ్ వెంకటేష్, పి.రామ్మోహన్ మాట్లాడుతూ దేశంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నుంచి విద్యపై దాడి చేస్తూనే ఉందని, దానిలో భాగంగానే విద్యలో కాషాయీకరణ, కేంద్రీకరణ, కార్పొరేటీకరణ విధానాన్ని అవలంభిస్తోందని అన్నారు. నేడు ఎన్‌సిఇఆర్‌టి సిలబస్ లో చరిత్ర పాఠ్యాంశాలను, శాస్త్ర సంబంధమైన అంశాలను తొలగించడం సమంజసం కాదని అన్నారు. చరిత్రలో స్వాతంత్ర ఉద్యమ నాయకుల త్యాగాలను తొలగించి రేపటి తరానికి దేశద్రోహులైన సావర్కర్ , గోల్వాల్కర్ లాంటివారిని దేశభక్తులుగా చిత్రీకరిస్తారా అని విమర్శించారు. సైన్స్ పాఠ్యాంశాలలో పునరుత్పత్తి పాఠ్యాంశాన్ని తొలగించడం విద్యార్థులలో మానవుడు ఎలా పుట్టాడో తెలియకుండా చేయడం అనేది పూర్తిగా విద్యార్థులను తిరోగమనం వైపు తీసుకెళ్లడమేనని అన్నారు. తొలగించిన పాఠ్యాంశాలను తిరిగి పునరుద్ధరించి, విద్యార్థుల శాస్త్ర సాంకేతిక మేధో తేజస్సును పెంపొందింప చేయాలని డిమాండ్ చేశారు. ఈ విధానాలన్నింటికీ కారణమైన నూతన జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని, లేని పక్షంలో దేశవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు డి.రాము, సోమేష్ , జగదీష్, సౌమ్య, సంధ్య , లావణ్య ,రమేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

# రాజ్యాంగాన్ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - వేపాడ

స్వేచ్ఛ, సమానత్వం, లౌకితత్వం, సమాన హక్కులకు కారణమైన రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతయినా ఉందని పలువురు వక్తలు అన్నారు. మండలంలోని సింగరాయి గ్రామంలో సామాజిక కార్యకర్త రిక్కి అప్పారావు ఆధ్వర్యాన మంగళవారం 'అంబేద్కర్, బుద్ధిజం'పై మేళా నిర్వాహించారు. ఈసందర్భంగా టిడిపి నియోజకవర్గ నాయకులు గుంప వెంకటరావు అధ్యక్షతన జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ సమాజంలో ప్రతి పౌరుడు తమ ప్రాథమిక హక్కులను పొందాలని, లౌకితత్వంతో కూడిన రాజ్యాంగాన్ని అంబేద్కర్ ఏర్పాటు చేస్తే నేటి బిజెపి పాలకులు తూట్లు పొడుస్తున్నారని అన్నారు. భారతదేశ ఐక్యతను విచ్ఛిన్నం చేస్తూ రాజ్యాంగాన్ని అమలు జరగనీయకుండా కార్పొరేట్ శక్తులకు దేశ సంపదను దోచి పెడుతున్నారని అన్నారు. ఈ నేపథ్యంలోనే బిజెపి విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 14 నుండి 30 తేదీ వరకు సమరభేరి ద్వారా ప్రచార ఉద్యమం చేపట్టామని తెలిపారు. అధికారంలోకి వచ్చిన 8ఏళ్లలో దేశాన్ని నాశనం చేశారన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవడమే అంబేద్కర్‌కు మనం ఇచ్చే ఘన నివాళి అని అన్నారు. ఎస్.కోట నియోజకవర్గ టిడిపి నాయకులు గొంప కృష్ణ మాట్లాడుతూ అంటరానితనం రాజ్యమేలుతున్న రోజుల్లో అంబేద్కర్ తరగతి బయట ఉండి చదువుకొని భారత దేశానికి రాజ్యాంగాన్ని రచించిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. చదువే ప్రతి ఒక్కరి జీవితాన్ని మారుస్తుందని, ప్రతి ఒక్క విద్యార్థి చదువుకొని ఉన్నత శిఖరాలను అవరోధించాలని కోరారు. బుద్ధిస్టులు డాక్టర్ మాటూరి శ్రీనివాసు, జి.నవీన్ మాట్లాడుతూ అన్ని మతాలకు ప్రథమ గ్రంథం రాజ్యాంగమేనని అన్నారు. స్త్రీ, పురుషుల సమానత్వం గురించి మొట్టమొదట మాట్లాడింది బుద్ధుడేనని, వేదాలను ప్రశ్నించి మొట్టమొదటి విప్లవకారుడయ్యాడని అన్నారు. కులమతాలు, అసమానతలు లేని దేశం నిర్మితమవ్వాలంటే రాజ్యాంగాన్ని కచ్చితంగా అమలు చేసి తీరాలని వారు కోరారు. అంతకుముందు గ్రామంలోని రామాలయం నుంచి సభా వేదిక వరకు థింసా నృత్యాలు, మంగళ వాయిద్యాలతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్, గౌతమ బుద్ధుని విగ్రహాల వద్ద పతాకావిష్కరణ చేశారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన సాంప్రదాయ నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం ఎనిమిది వందల మంది పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అంబేద్కర్, బుద్ధుని మీద నిర్వహించిన వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా అనంతగిరి మండలం నుండి వచ్చిన సంప్రదాయ గిరిజన థింసా నృత్య కళాకారులకు టిడిపి నాయకులు గొంప కష్ణ రూ.10వేలు ఆర్థిక సాయం అందించారు. పిహెచ్‌సి ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సింగరాయ గ్రామ సర్పంచ్ నిరుజోగి వెంకటరావు, ఎంఇఒ జి.శ్రీదేవి, ఎస్ఐ రాజేష్, రైతు సంఘం నాయకులు చల్లా జగన్, పిహెచ్‌సి వైద్యాధికారి కె.రాజు, డిప్యూటీ తహశీల్దార్ సన్యాసినాయుడు, టిడిపి నాయకులు గుమ్మడి భారతి, ఎస్.గణేష్, వైకె నాయుడు తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్, బుద్ధిజం మేళాలో వక్తలు**



సభలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి తమ్మినేని సూర్యనారాయణ

## బిజెపిని సాగనంపి..దేశాన్ని కాపాడుకుందాం

**బొబ్బిలి :** బిజెపిని సాగనంపి దేశాన్ని కాపాడుకుందామని సిపిఎం, సిపిఐ నాయకులు ఎస్ గోపాలం, కోట అప్పన్న పిలుపునిచ్చారు. ప్రజా వ్యతిరేక నిరంకుశ మతోన్మాద బిజెపిని సాగనంపాలని కోరుతూ పట్టణంలోని తాండ్ర పాపారాయ జంక్షన్, జండా మహల్ సెంటర్‌లలో మంగళవారం ప్రచార భేరీపై ప్రచారం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి అదానీ, అంబానీ లాంటి అతి సంపన్నులకు దేశ సంపదను దోచిపెడుతోందన్నారు. ప్రశ్నించే ప్రతి ఒక్కరిని నిరంకుశంగా అణచివేస్తున్నారు. అన్ని రకాల నిత్యావసర వస్తువుల ధరలు పెంచి, ప్రజలపై మోయలేని భారాలు ఈ పాలకులు మోపుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ముసలాకు శ్రీనివాస్, ఎఐటియుసి నాయకులు కె.వెంకట సత్యనారాయణ, దాడి సింహాచలం, సిఐటియు నాయకులు అలమండ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## రూట్ మ్యాప్ పరిశీలన

**బొబ్బిలి :** పట్టణంలోని గొల్లపల్లి గ్రామంలోని దాడితల్లి అమ్మవారి పండగ సందర్భంగా ఊరేగింపు రూట్ మ్యాప్‌ను మంగళవారం మున్సిపల్ చైర్మన్ వెంకట మురళీ కృష్ణారావు పరిశీలించారు. దాడితల్లి పండగ సందర్భంగా బైపాస్ రోడ్ మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయాలని, డ్రైనేజీలో పూడిక తీయ్యాలని, రోడ్డు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. పండగ మూడు రోజులు తాగునీటి సమస్యను అంతరాయం కలగకుండా ఉండాలన్నారు. సిరిమాను ఊరేగింపు జరిగిన వెంటనే రోడ్లను శానిటేషన్ చెయ్యాలని మున్సిపల్ సిబ్బందిని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ సురేష్ కుమార్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ అనుపమ, మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 23న గురుకుల ప్రవేశ పరీక్ష

**నెల్లిమర్ల :** స్థానిక డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల బాలికల విద్యాలయంలో 5వ తరగతి, ఇంటర్ ప్రథమ సంవత్సరం ప్రవేశానికి 23న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపల్ కె. ఉషారాణి తెలిపారు. ఈ సందర్భంగా ఆమె విలేకర్లతో మాట్లాడుతూ దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సంబంధించిన హాల్ టిక్కెట్లు http://apg-pcet. apgpcet.in వెబ్ సైట్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు. పరీక్షలు ఓ.ఎం.ఆర్ విధానంలో ఉంటాయని, పరీక్షను బ్లూ లేదా బ్లాక్ బాల్ పాయింట్ పెన్‌తో మాత్రమే బబ్లింగ్ చేయాలని సూచించారు. కాగా 5వ తరగతి పరీక్ష ఉదయం 10 గంటల నుండి 12 గంటల వరకు, జూనియర్ ఇంటర్మీడియట్ పరీక్ష మధ్యాహ్నం 2 గంటల నుండి 4.30 గంటల వరకు ప్రవేశ ఉంటుందని, పరీక్షకు 30 నిమిషాలు ముందుండాలని ఆమె తెలిపారు.

## వడదెబ్బ పై అవగాహన

**వంగర :** ఎండలు తీవ్రతరంగా ఉండటంతో స్థానిక మండల కేంద్రంలో పనిచేస్తున్న ఉపాధి హామీ కూలీలకు వడ దెబ్బ తగలకుండా తీసుకోవలసిన జాగ్రత్తలపై ఎఎన్ఎం విశాలాక్షి ఆధ్వర్యంలో మంగళవారం అవగాహన కల్పించారు. ఈ వేసవి ఓఆర్ఎస్ ప్యాకెట్లను ఉపాధి హామీ కూలీలకు ఆమె అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు సత్యవతి, మరియమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ బొత్స అప్పలనాయుడు పాల్గొన్నారు.

## పిడిశీలలో డ్రోన్ సర్వే

**గజపతినగరం :** మండలంలోని పిడిశీలలో మంగళవారం డ్రోన్ సర్వేను సర్పంచ్ పాండ్రంకి మాధవి ప్రారంభించారు. జగనన్న భూ శాశ్వత భూ హక్కు భూ రక్ష పథకంలో భాగంగా ఈ డ్రోన్ సర్వే నిర్వహించారు. గ్రామంలో ఉన్న 400 ఎకరాలను త్వరగా సర్వే చేయాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ భవాని, గ్రామ సర్వేయర్ వెంకటేష్, విఆర్ఒ చిరంజీవి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## రంజాన్ తోఫా పంపిణీ

**బొబ్బిలి:** రంజాన్ సందర్భంగా పేద ముస్లింలకు అబ్దుల్ అమిద్ భాయ్ సమకూర్చిన రంజాన్ తోఫా సరుకులను మసీదులో మంగళవారం టిడిపి నియోజకవర్గ ఇంచార్జ్ బేబినాయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు రంజాన్ ఘనంగా జరుపుకోవాలనే రంజాన్ తోఫా ఎంతో దోహద పడుతోందన్నారు. 105 మంది పేద ముస్లింలకు రంజాన్ తోఫా అందజేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి దొగ్గ సత్యవంతుడు

## నవధాన్యాల సాగుతో నేల బాగు

**వేపాడ :** నవధాన్యాలు సాగుతో నేలతల్లికి బాగు అని డిపిఎం ఎం. ఆనంద్ అన్నారు. స్థానిక వైకెపి కార్యాలయంలో మంగళవారం రైతులకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి దొగ్గ సత్యవంతుడు మాట్లాడుతూ వ్యవసాయాధికారులు చెప్పిన విధంగా వ్యవసాం చేస్తే మంచి దిగుబడులు వస్తాయన్నారు. అనంతరం రైతులకు నవధాన్యాలు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి శానపతి అప్పారావు, డిసిసిబి చైర్మన్ చిన రాము నాయుడు, ఎఎంసి చైర్‌పర్సన్ కస్తూరి, మండల వ్యవసాయ కమిటీ చైర్మన్ ఈర్ల సన్యాసినాయుడు, కోఆపరేటివ్ అధ్యక్షులు రామ్మూర్తి నాయుడు, జెసిఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, వివిధ గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు హాజరయ్యారు.

## అగ్ని ప్రమాదాలపై అవగాహన

**శృంగవరపుకోట :** జాతీయ అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రం పరిధిలో మంగళవారం భారత గ్యాస్ ఏజెన్సీలో పనిచేసే సిబ్బందికి గ్యాస్ ప్రమాదాలపై అవగాహన కల్పించారు. గ్యాస్ లీకేజీ సంభవించునపుడు తీసుకోవలసిన జాగ్రత్తలు, నివారణ పద్ధతులు గురించి అగ్నిమాపక అధికారి షేక్ మదీనా వివరించారు. ఫైర్ డ్రిల్స్, రెస్క్యూ మెథడ్స్ నిర్వహించి అవగాహన కల్పించారు.

## 67 మందికి ఉచిత వైద్య సేవలు

**కొత్తవలస :** వియ్యంపేట పిహెచ్‌సి పరిధిలోని అప్పన్నపాలెం పంచాయతీ దత్తి, ధన్నినపేట గ్రామాల్లో డాక్టర్ వైఎస్ఆర్ ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ ప్రోగ్రామ్‌లో భాగంగా మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ బి. సింహాద్రి నాయుడు 67 మందికి తనిఖీ చేసి ఉచిత వైద్య సేవలు అందించారు. అప్పన్నపాలెం సర్పంచ్ కోన దేముడు మాట్లాడుతూ ఇంటి దగ్గరకే వైద్య సేవలు అందించడం గొప్ప విషయమన్నారు. ప్రజలు అందరూ ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. అనంతరం అంగన్వాడీసెంటర్ విజిట్ చేసి పిల్లలకి వయసుకి తగిన ఎత్తు ఎత్తుకి తగిన బరువు ఉన్నారా లేదా అని ఆరోగ్య తనిఖీలు చేసి ఉచితంగా మందులు అందించారు. పిల్లలు భోజనానికి ముందు మల విసర్జన తర్వాత చేతులు సబ్బుతో శుభ్రంగా కడుగుకోవాలని సూచించారు. పిల్లలకు ప్రతి బుధవారం, శనివారం ఐరన్ ఫోలిక్ సిరప్స్ వేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్ రమణమ్మ, నాగేశ్వరావు, ఎమ్‌పిహెచ్ఇఒలు గోవిందరాజులు, ఎంఎల్‌హెచ్‌పి పావని, ఏఎన్ఎమ్ లక్ష్మి, హెల్త్ అసిస్టెంట్ సత్యారావు, ఆశ వర్కర్ స్వప్న, అంగన్వాడీ వర్కర్ ధనలక్ష్మి, వాలంటీర్స్, డేటా ఆపరేటర్ శైలజ, పైలట్ గౌస్ పాల్గొన్నారు.

## 66 కిలోల గంజాయి పట్టివేత

**విజయనగరం :** స్థానిక రైల్వే స్టేషన్‌లోని రిజర్వేషన్ కౌంటర్ వద్ద నాలుగు బ్యాగులతో గంజాయి తరలిస్తున్న వ్యక్తిని మంగళవారం పోలీసుల అరెస్టు చేశారు. అతని నుంచి 66 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు ఒకటో పట్టణ సిఐ వెంకటరావు తెలిపారు. అనుమానాస్పదంగా నాలుగు బ్యాగులతో ఒక వ్యక్తి తిరుగుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు ఎస్ఐలు భాస్కరరావు, అశోక్ కుమార్ తనిఖీ చేసి పట్టుకున్నారు. నిందుడు పశ్చిమబెంగాల్‌కు చెందిన మౌలా బాక్స్‌గా గుర్తించామని మరో ఇద్దరు నిందుతులున్నారని వారిని కూడా త్వరలో పట్టుకుంటామని ఆయన తెలిపారు.

## 8 మద్యం సీసాలు పట్టివేత

**బొబ్బిలి:** స్థానిక ఇందిరమ్మ కాలనీకి చెందిన బెల్లాన సాయి అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు గుర్తించి అతన్ని అరెస్ట చేశామని ఎస్ఇబి సిఐ జైభీమ్ మంగళవారం తెలిపారు. అతని వద్ద నుంచి 8 మద్యం సీసాలను స్వాధీనం చేసుకుని అతన్ని రిమాండ్‌కు తరలించామన్నారు.

# జ్యూట్ మూత.. ఉపాధి వేట

- బొబ్బిలిలో మూతపడిన జ్యూట్ మిల్లులు
- రోడ్డున పడ్డ 3500 కుటుంబాలు
- ఉపాధి కోసం కార్మికుల వెతలు

**ప్రజాశక్తి- బొబ్బిలి**

బొబ్బిలి ప్రాంతంలో జ్యూట్ మిల్లులు మూతపడడంతో ఉపాధి కోసం కార్మికులు వెతుకులాడుతున్నారు. 2015లో శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు మూతపడడంతో మూడు వేల కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. 2018లో దిబ్బగుడివలస వద్ద ఉన్న జ్యోతి జ్యూట్ మిల్లు మూతపడడంతో 300 కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయి. తాజాగా నెల రోజుల క్రితం రామన్నదొరవలస వద్ద ఉన్న నవ్య జ్యూట్ మిల్లు కూడా మూతపడడంతో మరో 300 కార్మికుల కుటుంబాలు రోడ్డున పడ్డాయి. దీంతో కార్మికులంతా ఉపాధి కోసం వెతుకులాట మొదలు పెట్టారు. ఇప్పటికే కొంత మంది ఏదో ఒక పని చేసుకుని జీవనం సాగిస్తుండగా ఇంకొంతమంది మాత్రం వారికి తగిన పని దొరక్కా పని కోసం రోడ్లు వెంబడ తిరుగుతున్నారు.

### శ్రీలక్ష్మి శ్రీనివాస దారిలో జ్యోతి, నవ్య యాజమాన్యాలు

శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు యాజమాన్యం దారిలోనే జ్యోతి, నవ్య జ్యూట్ మిల్లు యాజమాన్యాలు వెళ్తున్నట్లు తెలిస్తోంది. 2015లో మూతపడిన శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లును యాజమాన్యం తెరుస్తోందని భావించిన కార్మికులకు ఇటు వైసిపి ప్రభుత్వం, అటు యాజమాన్యం షాక్ ఇచ్చింది. జ్యూట్ మిల్లును తెరవకుండా మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసి యాజమాన్యం సొమ్ము చేసుకుంది. ఇదే పద్ధతిలో జ్యోతి జ్యూట్ మిల్లు స్థలాన్ని, నవ్య జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసి సొమ్ము చేసుకునేందుకు యాజమాన్యాలు ఆలోచిస్తున్నట్లు చర్చ జరుగుతుంది. నవ్య, జ్యోతి జ్యూట్ పరిశ్రమలు తెరవకపోతే మరో 600 కార్మిక కుటుంబాలు రోడ్డున పడతాయి.



రైలులో నెల్లిమర్ల, కొత్తూరు జ్యూట్ మిల్లులకు వెళ్తున్న బొబ్బిలి కార్మికులు

### జ్యూట్ మిల్లులు తెరిపిస్తామన్న హామీ గాలికి

వైసిపి అధికారంలోకి వస్తే మూతపడిన జ్యూట్ మిల్లులను తెరిపిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాదయాత్రలో, బొబ్బిలిలో తనను గెలిపిస్తే మిల్లులు తెరిపిస్తామని ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు హామీ ఇచ్చి ఓట్లు అడిగారు. మూత పడిన పరిశ్రమలు తెరిపిస్తే కార్మికులకు ఉపాధి దొరుకుతుందని భావించిన కార్మికులు, ప్రజలు వైసిపిని గెలిపించారు. హామీ అమలు చేస్తారని ఆశతో వైసిపిని గెలిపిస్తే హామీ అమలు చేయడం లేదని కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మూత పడిన మిల్లులను తెరిపిస్తామన్న ఎమ్మెల్యే శంబంగి సమక్షంలో శ్రీలక్ష్మి శ్రీనివాస జ్యూట్ మిల్లు స్థలాన్ని రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేసేందుకు ఒప్పందం జరగడం విశేషం.



పెట్రోల్ బంకులో పని చేస్తున్న జ్యూట్ కార్మికుడు నాగేశ్వరరావు

### కన్నెత్తి చూడని ఎమ్మెల్యే

వైసిపి అధికారంలోకి వచ్చిన తరువాత రెండు పరిశ్రమలు మూత పడ్డాయి. వీటిని తెరిపించాలని కార్మికుల పెద్ద ఎత్తున స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడున కోరారు. అయినప్పటికీ ఆయనలో స్పందన కనిపించడంలేదని కార్మికులే బహిరంగంగా చెబుతున్నారు. ఎన్నిసార్లు వినతులిచ్చినా ఆయన పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వినిపిస్తున్నాయి. పై పెచ్చు జ్యూట్‌మిల్లులకు సంబంధించిన భూములను రియల్ ఎస్టేట్‌కి ఆయన ద్వారానే అమ్మేస్తున్నట్లు ప్రచారం ఉంది.

### వైసిపి హయాంలో రెండు పరిశ్రమలు మూత

వైసిపి అధికారంలోకి వస్తే మూత పడిన పరిశ్రమలను తెరిపిస్తామని హామీ ఇచ్చిన పాలకులు నడుస్తున్న పరిశ్రమలను నడిపించడంలో విఫలమయ్యారు. అధికారంలోకి వచ్చిన తర్వాత మూత పడిన పరిశ్రమలు తెరిపించడం పక్కన పెడితే నడుస్తున్న రెండు పరిశ్రమలు మూత పడడం విశేషం. వైసిపి హయంలో లచ్చయ్యపేట ఎన్‌సిఎస్ చక్కెర పరిశ్రమ, నవ్య జ్యూట్‌మిల్లు మూత పడింది. దీంతో నవ్యలో పని చేసిన 300మంది కార్మికులు, ఎన్‌సిఎస్‌లో పని చేసిన సుమారు 500మంది కార్మికులు రోడ్డున పడ్డారు. చక్కెర పరిశ్రమ మూతతో చెరకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చెరకు సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. కొంతమంది రైతులు భూములను ఖాళీగా ఉంచలేక చెరకు సాగు చేస్తున్నా ప్రభుత్వం కొనుగోలు చేయకపోవడంతో నష్టపోతున్నారు.

### ఉపాధి కోసం వెతుకులాట

జ్యూట్ పరిశ్రమలు, చక్కెర పరిశ్రమ మూత పడడంతో ఉపాధి కోసం కార్మికులు వెతుకులాడుతున్నారు. కొంతమంది కార్మికులు నెల్లిమర్ల, ఏలూరు సమీపంలో ఉన్న కొత్తూరు జ్యూట్ పరిశ్రమలకు పనులు కోసం వెళ్తున్నారు. మరికొందరు షాపులు, పెట్రోల్ బంకులలో పని చేసుకుని జీవనం సాగిస్తున్నారు. మరికొందరికి పనుల్లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి మూత పడిన జ్యూట్ మిల్లులను, చక్కెర పరిశ్రమను తెరిపించి ఉపాది కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

### కార్మికులకు ఉపాధి కల్పించాలి

జ్యూట్, చక్కెర పరిశ్రమ కార్మికులకు ఉపాధికల్పించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. జ్యూట్ పరిశ్రమలు, చక్కెర పరిశ్రమ మూత పడడంతో కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వైసిపి అధికారంలోకి వస్తే మూత పడిన పరిశ్రమలను తెరిపించని ప్రభుత్వం నడుస్తున్న పరిశ్రమలను కూడా మూత పడేస్థితిలోకి నెట్టేస్తుందని విమర్శించారు. మూత పడిన పరిశ్రమలను తెరిపించాలని, నూతన పరిశ్రమలు ఏర్పాటు చేయాలని, గ్రోత్ సెంటర్ పరిశ్రమలలో స్థానికులకు పని కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిచో పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# అన్ని రంగాల్లో అభివృద్ధే లక్ష్యం


- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి
- రూ.28లక్షలతో అభివృద్ధి పనులను శంకుస్థాపన

**ప్రజాశక్తి-విజయనగరం టౌన్**

నగరాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేయడమే ధ్యేయంగా కృషి చేస్తున్నామని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఇండోర్ స్టేడియంలో 28 లక్షల రూపాయలతో నిర్మించ తలపెట్టిన వివిధ అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఇండోర్ స్టేడియం వద్ద శిలాఫలకాన్ని ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో చేపట్టిన పరిశీలనలో ఇండోర్ స్టేడియంలో మరమత్తు పనుల విషయమై క్రీడాకారులు తమ దృష్టికి తీసుకువచ్చారన్నారు. వెంటనే స్పందించి మరమ్మత్తు పనులకు అంచనాలను వేయమని ఇంజనీరింగ్ అధికారులకు ఆదేశించామన్నారు. దీంతో గాల్వనైజెడ్ రూఫ్, సీలింగ్, పెయింటింగ్, కాలువలు వంటివి ఏర్పాటుకు శ్రీకారం చుట్టామన్నారు. చెరువులు, క్రీడా ప్రాంగణాలు, పార్కులు వంటివి పునర్నిర్మిస్తూ నగరాన్ని ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇప్పటికే ప్రధాన జంక్షన్ ను అభివద్ధి చేసామని,18లక్షలతో కోడి రామ్మూర్తి వ్యాయామశాల, రాజీవ్ స్టేడియం వంటి క్రీడా ప్రాంగణాలు కూడా అభివద్ధి చేసి ప్రజా వినియోగంలోకి తెచ్చామన్నారు. కల్పిస్తున్న సౌకర్యాలను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మేయరు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, కమిషనర్ ఆర్ శ్రీ రాములనాయుడు, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, స్థానిక కార్పొరేటర్ ఆశపు సుజాత,రాష్ట్ర పరిశ్రమల అభివృద్ధి మండలి డైరెక్టర్ బంగారు నాయుడు, సిటీ బ్యాడ్మింటన్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు డాక్టర్ వివిఎస్ ప్రసాద్, సురేష్, ఎంకెబి శ్రీను, తోనంగి జగన్నాథరెడ్డి పాల్గొన్నారు.

**అభివృద్ధి పనులకు మేయర్ శంకుస్థాపన**

ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించి, సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దడమే ధ్యేయంగా కషి చేస్తున్నామని నగర మేయర్ విజయలక్ష్మి అన్నారు. దాసన్నపేట ప్రాంతంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామితో కలిసి శంకుస్థాపన చేశారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రజా వినతులను స్వీకరించి వాటిని పరిష్కరించే దిశగా కృషి జరుగుతోందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ పొంతపల్లి మాలతి, డిప్యూటీ మేయర్ రేవతి దేవి, జోనల్ ఇన్‌ఛార్జిలు బొద్దాన అప్పారావు, బోడ సింగి ఈశ్వరరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

## ఫుడ్ బ్యాంక్‌ల ఏర్పాటు అభినందనీయం

**విజయనగరం టౌన్ :** నగరంలో అన్నార్తుల ఆకలి బాధలను తీర్చేందుకు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం ముదావహమని డిసిసిబి సిఇఒ కెంబూరి జనార్దన్ రావు అన్నారు. మంగళవారం కోట వద్దనున్న ఫుడ్ బ్యాంకువద్ద పేదలకు అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరంలో పేదల కోసం ఐదు ఫుడ్ బ్యాంకులు ఏర్పాటు కావడం అభినందనీయమన్నారు. వైసిపి నాయకులు ఎవర్న కుమార స్వామి మాట్లాడుతూ అన్నదాన కార్యక్రమం జరిపించేందుకు అందరి సహకారం అవసరమన్నారు. ప్రతి ఒక్కరూ అన్నదాన కార్యక్రమాల నిర్వహణకు ముందుకు రావాలన్నారు. దాతల సహకారం ఉంటే మరిన్ని కార్యక్రమాలు చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో హోటల్ శ్రీ చంద్రాస్ యజమాని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# పెద్దకృష్ణ రాజపురంలో గ్రామసభ

**ప్రజాశక్తి- వేపాడ**

మండలంలోని పెదకృష్ణ రాజపురం గ్రామంలో మంగళవారం సర్పంచ్ మమ్ములూరి జగన్నాథం అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ముందుగా గ్రామాభివృద్ధి ప్రణాళికపై చర్చించి గ్రామ సభలో ఆమోదం తెలిపారు. తాగునీరు, విద్యుత్, పారిశుద్యం, గృహ నిర్మాణం పై సమీక్షించి తగు చర్యలు కోసం తీర్మానించారు. ఈ గ్రామ సభలో కన్వీనర్ మమ్ములూరి వెంకటరావు, వార్డ్ మెంబర్లు మమ్ములూరి సత్తి బాబు, కిలాపర్తి మురళీ కృష్ణ, గొల్లు గంగమ్మ, మమ్ములూరి వాసు, చంద్రుడమ్మ, జి.లక్ష్మి, జి. ముత్యాలునాయుడు, పి. కృష్ణ, ఎం. సన్యాసినాయుడు, ఎం. సత్తిబాబు, ఎం. అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.



కొత్తవలస: మాట్లాడుతున్న సర్పంచ్ లక్ష్మి

**కొత్తవలస :** గ్రామ పంచాయితీల్లో సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ మదిన లక్ష్మి అన్నారు. గ్రామ పంచాయతీ సమావేశం పంచాయతీ కార్యదర్శి మాధవీలత ఆధ్వర్యంలో మంగళవారం జరిగింది. సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీలో అన్ని వర్గాల ప్రజలూ ప్రభుత్వం కల్పిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. స్పెషల్ ఆఫీసర్ జి. శ్రీదేవి మాట్లాడుతూ పంచాయతీలో బడి ఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించాలన్నారు. ఈ సమావేశంలో మదిన అప్పలరామ్, మదిన ప్రకాష్, మెడికల్ ఆఫీసర్, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎస్‌కోట: మాట్లాడుతున్న వైస్ ఎంపిపి సుధారాజు

**శృంగవరపు కోట :** గ్రామాభివృద్ధి కోసమే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని స్థానిక ఎంపిటిసి, వైస్ ఎంపిపి ఇందుకూరి సుధారాజు అన్నారు. మండలంలోని ముషిడిపల్లిలో మంగళవారం సర్పంచ్ సొలుబొంగు దారప్ప అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారుఢ. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాభివృద్ధికి ప్రజలంతా పార్టీలకు అతీతంగా కలిసి రావాలన్నారు. ఈ సభలో పంచాయితీ సిబ్బంది, గ్రామ సచివాలయ సిబ్బంది, ప్రజలు, స్థానిక పెద్దలు పాల్గొన్నారు.

# పేదల కోసమే టిడిపి

**మాజీ స్పీకర్ ప్రతిభా భారతి**

**ప్రజాశక్తి- రేగిడి**

పేద ప్రజల కోసమే నందమూరి తారక రామారావు టిడిపిని స్థాపించారని, ఆయన ఆశయాలకు అనుగుణంగా చంద్రబాబు హయాంలో అన్ని వర్గాల పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు టిడిపి ప్రవేశ పెట్టిందని మాజీ స్పీకర్, జాతీయ పోలిట్ బ్యూరో సభ్యులు కావలి ప్రతిభా భారతి అన్నారు. రాజాం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ బలోపేతం లక్ష్యంగా మంగళవారం రేగిడి మండలంలోని ఉణుకూరు, అప్పాపురం, గ్రామాల టిడిపి పార్టీ నాయకులు కార్యకర్తలతో ఆమె సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో పేద ప్రజలు పడుతున్న కష్టనష్టాలను తెలుసుకుని వారిని ఆదుకునేందుకు నారా లోకేష్ యువగలం పేరుతో పాదయాత్ర చేపడుతున్నారని, లోకేష్ పాదయాత్రతో వైసిపిలో వణుకు మొదలైందని అన్నారు. టిడిపి హయాంలోని దళిత విద్యార్థులు కోసం విదేశీ విద్యను ప్రవేశపెట్టి దళితులకు సముచిత స్థానం కల్పించేవారన్నారు. వైసిపి తాటాకు చప్పుళ్లకు టిడిపి భయపడదని, రానున్న ఎన్నికల్లో వైసిపిని ఓడించడానికి పేద ప్రజలు ఎదురు చూస్తున్నారని ఆమె అన్నారు. ఈ సమావేశంలో రాజాం నియోజకవర్గం పరిధిలోని రేగిడి, వంగర, సంతకవిటి, రాజాం మండలాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# సిఎంను మరోసారి ఆశీర్వాదించండి

**బొండపల్లి:** సిఎం జగన్మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వాదించాలని గజపతినగరం ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య అన్నారు. మండలంలోని వేంద్రాం గ్రామంలో మంగళవారం సర్పంచ్ కర్రోత శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపిపి చల్లా చలంనాయుడ, ఎఎంసి చైర్మన్ ముత్యాలనాయుడు, ఎంపిడిఒ వేదావతి, నాయకులు, పాల్గొన్నారు.

**దెంకాడ :** నెల్లిమర్ల ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు స్వగ్రామం మోపాడలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు గురించి ఆరా తీశారు. అనంతరం జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని నిర్వహించి ఇంటింటికి స్టిక్కర్లను అతికించారు. ఇందులో భాగంగా కన్వీనర్లుకు కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి బంటుపల్లి వాసుదేవరావు, వైస్ ఎంపిపి పిన్నింటి తమ్మినాయుడు, సర్పంచ్ బడ్డుకొండ రమేష్, ఎఫ్ఎస్‌సిఎస్ డైరెక్టర్ బంటుపల్లి మోహన్, నాయకులు, పాల్గొన్నారు.



బొండపల్లి: బ్రోచర్‌ను అందిస్తున్న ఎమ్మెల్యే బొత్స

**విజయనగరంటౌన్:** స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి ఆధ్వర్యంలో మంగళవారం గుంకలాం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించార. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. మరోసారి జగన్మోహన్‌రెడ్డిని గెలిపంచాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు కె.నారాయ, జగ్గునాయుడు పాల్గొన్నారు.

**కొత్తవలస:** స్థానిక చీపురవలసలో ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావ ఆధ్వర్యంలో గడపగడపకు మన ప్రభుత్వం కారక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా ఆయన ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు పాల్గొన్నారు.



కొత్తవలస: పథకాలు గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే

### 'గడపగడపకు' బహిష్కరణ

**బొబ్బిలి :** స్థానిక మున్సిపాలిటీ గొల్లపల్లిలో మంగళవారం 12వ వార్డులో నిర్వహించిన గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని అవార్డు కౌన్సిలర్ సావు శారద బహిష్కరించారు. సమాచారం లేకుండా వార్డులో గడపగడపకు ప్రభుత్వం నిర్వహించారని, తమ వార్డు అభివృద్ధికి ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ రూ. 20లక్షలు మంజూరు చేస్తే అడ్డుకున్నారని కౌన్సిలర్ శారద ఆరోపించారు. వార్డు అభివృద్ధిని అడ్డుకోవడం వల్లనే గడపగడపకు ప్రభుత్వం కార్యక్రమాన్ని బహిష్కరించినట్లు చెప్పారు.

# తాగునీటి ఇబ్బంది రానివ్వొద్దు

**ప్రజాశక్తి - నెల్లిమర్ల**

గ్రామాల్లో తాగు నీటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఎంపిడిఒ జి.గిరిబాల సూచించారు. మంగళవారం ఆమె కొండవెలగాడలో సమ్మర్ క్రాష్ ప్రోగ్రాంను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో మరమ్మతులకు గురైన బోర్లు బాగు చేసి తాగు నీటిని అందించడం క్రాష్ ప్రోగ్రాం ప్రధాన లక్ష్యమన్నారు. పంచాయతి కార్యదర్శులు, గ్రామీణ నీటి సరఫరా పథకం సిబ్బంది గ్రామాల్లో తాగు నీటి సమస్య గుర్తించి పరిష్కరించాలన్నారు. ఈ కార్య క్రమంలో ఇఒపిఆర్‌డి హెచ్. భానోజీరావు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఎంపిడిఒ గిరిబాల

# ఘనంగా పాఠశాల వార్షికోత్సవం

**దెంకాడ :** మండలంలోని పిన తాడివాడ ప్రాథమికోన్నత పాఠశాలలో మంగళవారం వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఇఒ అంబళ్ల కృష్ణారావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు కూడా బలోపేతం అయ్యాయన్నారు. నాడు నేడు రెండో విడతలో ప్రభుత్వం పాఠశాలలను ఎంతో అభివృద్ధి చేసిందన్నారు. విద్యార్థులకు బట్టలతోపాటు పుస్తకాలు, స్కూలు బ్యాగ్‌లు, ఇవ్వడమే కాకుండా వారికి బలమైన పౌష్టికాహారం కూడా ప్రభుత్వం అందిస్తుందన్నారు. ప్రైవేట్ పాఠశాల కంటే ప్రభుత్వ పాఠశాలలోనే ఎక్కువ మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇందులో భాగంగా నూతనంగా విధులకు హాజరైన ఉపాధ్యాయులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లంక లక్ష్మణరావు, ఎంపిటిసి విజినగిరి అచ్చునాయుడు, మాజీ సర్పంచ్ వాళ్ళ వెంకట్రావు, ఉపసర్పంచ్ రావాలా అప్పలనాయుడు, పాఠశాల హెచ్ఎం రామారావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయురాలను సత్కరిస్తున్న ఎంఇఒ, తదితరులు

# 'భూములు కాజేసిన వారిపై చర్యలు తీసుకోండి'

**ప్రజాశక్తి- శృంగవరపుకోట**

'మాకున్న కొద్దిపాటి భూములను అధికార పార్టీ నాయకుల సాయంతో కొంతమంది కాజేసేందుకు ప్రయత్నిస్తున్నారని అటువంటి వారి నుంచి మాకు రక్షణ కల్పించి మా భూములు మా వద్ద వుండే విధంగా అధికారులు సహకరించాలి' అని మండలంలోని ధర్మవరం గ్రామానికి చెందిన వికలాంగుడు సారిపల్లి దివాకర్ కోరారు. సోమవారం గ్రామ సచివాలయం వద్ద మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు కూర్చుని నిరసన తెలియజేశారు. తమ భూములు లాక్కునేందకు కుట్రలు జరుగుతున్నాయని అధికారులు దృష్టి సారించాలని నిరసన వ్యక్తం చేశాడు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ తనకు రెండు కళ్లు కనిపించవని తనకు ఇద్దరు వృద్యాప్యంలో వున్న తల్లిదండ్రులు వున్నారన్నారు. అయితే తమ బందువులు గతంలో కొంత భూమి గత విఆర్ఒల ద్వారా తమను మోసం చేసి వేరే వారి పేరున రాయించుకున్నారని ఈ విషయంలో న్యాయం చేయాలని రెవెన్యూ శాఖను కోరామన్నారు. మరోసారి తమకున్న కొద్దిపాటి భూములను లాక్కోవడానికి కొంతమంది తన తండ్రి సూరిబాబును అదివారం సాయంత్రం పోలం నుంచి వస్తుండగా గ్రామంలో గల మద్యం దుకాణానికి తీసుకువెళ్లి మద్యం పట్టించి స్థానిక సీత ఇంటివద్ద కొన్ని కాగితాలపై సంతకాలు చేయించుకున్నారని వాపోయాడు. తనకు ఆధారంగా వున్న భూమి పోతే తమ కుటుంబం రోడ్డున పడుతుందని అధికారులు ఈ విషయంపై విచారణ నిర్వహించి న్యాయం చేయాలని లేదంటే గ్రామంలో వున్న సచివాలయం వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తానని తెలిపాడు.




తల్లిదండ్రులతో కలిసి నిరసన తెలుపుతున్న దివాకర్